గౌరవ వేతనానికి నోచుకోలేదు!

- ఎంపీటీసీలకు అందని వేతనం
- గౌరవానికీ నోచుకోని వైనం
- సర్వసభ్య సమావేశాలకే పరిమితం



మండల పరిషత్ కార్యాలయం

దెందులూరు: ఎంపీటీసీ సభ్యులంటే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకే పరిమితం అనే భావనకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చేసిందని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు విన్నవించినా పట్టించుకోని అధికారులు ఎప్పుడు వేతనాలు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులను విస్మరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకు గౌరవ వేతనం కూడా మంజూరు చేయలేదు. కనీసం ప్రభుత్వ కార్యాక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వనప్పటికీ, గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడంపై సభ్యులు మండిపడుతున్నారు. ఇదే సమయంలో ఎలాంటి హోదా లేనప్పటికీ టీడీపీ నాయకులకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనం కోసం ఎదురు చూపులు

దెందులూరు నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో 70మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.3 వేలు గౌరవ వేతనంగా ఇవ్వాల్సిఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సక్రమంగానే గౌరవ వేతనం చెల్లించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు సభ్యులకు గౌరవ వేతనం చెల్లించలేదు. కనీసం ఆ అంశంపై దృష్టి సారించడంలేదు. ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటికీ రెండుసార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగినా ప్రజా ప్రతినిధుల ఖాతాల్లో మాత్రం నగదు జమ కాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

సర్వసభ్య సమావేశాలకే పరిమితం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశాలకు మాత్రమే పరిమితమయ్యారు. సమావేశాలకు హాజరు కావడం మినహా ప్రజా సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు వాపోతున్నారు. కనీసం ప్రభుత్వం అధికార కార్యక్రమాలకు సైతం ఆహ్వానించకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీ సభ్యులకు అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు. ప్రజలతో ఎన్నుకోబడిన తనను కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారు. కేవలం తాము సర్వసభ్య సమావేశాలకే పరిమితం అవుతున్నాం.
– సొంగ ప్రమీల,
ఎంపీటీసీ గాలాయగూడెం

గౌరవ వేతనం మంజూరు చేయాలి



పెండింగ్‌లో ఉన్న 15 నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయాలి. స్థానికంగా నిర్వహిస్తున్న అధికారిక కార్యాక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించడం లేదు. కేవలం సర్వసభ్య సమావేశాలకే పరిమితం అవుతున్నాం. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.
– అప్పన పద్మావతి,
వైస్ ఎంపీపీ, పెదపాడు

ప్రొటోకాల్ అమలు చేయాలి



ప్రజల చేత ఎన్నుకోబడిన వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు ప్రభుత్వం ప్రొటోకాల్ అమలు చేయాలి. ఏ పరిధిలో ప్రజా ప్రతినిధులైనా పంచాయతీరాజ్ నిబంధన ప్రకారం ప్రొటోకాల్ అమలు చేయకపోతే ఎలా.
– బి.రామసీత,
ఎంపీటీసీ, అప్పనవీడు

పెండింగ్ అంటూ కాలయాపన చేస్తున్నారు



ప్రభుత్వం ప్రజా ప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం గౌరవం ఇవ్వడం లేదు. కనీసం గౌరవ వేతనం కూడా ఇవ్వకపోతే ఎలా పెండింగ్ అంటూ కాలయాపన చేస్తున్నారు. అధికారులు బిల్లు పెట్టామంటున్నారు. ఇది సరైన విధానం కాదు.
– అంగదాల వేంకటేశ్వరరావు,
ఎంపీటీసీ, మేదినరావుపాలెం

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ


మందలపర్రు స్కూల్‌లో విద్యా సామగ్రి అందిస్తున్న లయన్స్ సభ్యులు

నిడమర్రు: మందలపర్రు ప్రైమరీ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.20 వేల విలువైన నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్‌కుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ తరపున పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు వివరించారు. కార్యదర్శి కిలారి రవిబాబు, కోశాధికారి రావూరి నాగరాజు తదితరులు పాల్గున్నారు.

వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలి

దెందులూరు: రైతులు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని పౌర సరఫరాల శాఖ, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం సీతంపేటలో రైతు డాక్టర్ పసుమర్తి మధు పొలంలో పామాయిల్ మొక్కను మంత్రి నాటారు. సీతంపేట పంట పొలాల్లో డ్రోన్ల సాయంతో మందులు స్ప్రే చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఆర్‌టీసీ విజయవాడ ప్రాంతీయ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా, ఉద్యానవనశాఖ అధికారి ఎస్.రామ్మోహన రావు, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో కె.శ్రీదేవి, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హ్యాండ్ బాల్ క్రీడకు నిబంధనలు కీలకం


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

దెందులూరు: హ్యాండ్ బాల్ క్రీడకు ట్రైనింగ్ షెడ్యూల్, నిబంధనలు కీలకమని రిసోర్స్ పర్సన్ డాక్టర్ బి.కృష్ణదీపిక అన్నారు. మంగళవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో గ్రౌండ్‌లో ప్రాక్టికల్స్ థియరీటికల్ సెషన్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఉదయం సాయంత్రం రెండు పూటలు విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు మాట్లాడుతూ శిక్షణ సమయంలో విద్యార్థులకు పరిశీలన, నిరంతర సాధన కృషి చాలా అవసరమన్నారు.

అభయాంజనేయుని ఆలయంలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. 200 మందికి నిర్వహించిన అన్నదానానికి అప్పనవీడుకు చెందిన పల్లెల దుర్గారావు సోదరులు ఆర్థిక సాయం అందించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

పేకాట స్థావరంపై దాడి.. 10 మంది అరెస్టు


పేకాట నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెదపాడు: పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి, 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.11 వేల 230 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని అప్పనవీడులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదసతీష్ తెలిపారు.

స్వచ్ఛభారత్ అమలు తీరు పరిశీలన


రావులపర్రులో పర్యటిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధి బృందం

ఉంగుటూరు: స్వచ్ఛభారత్ బృందం సభ్యులు రావులపర్రు గ్రామంలో ఆ పథకం అమలు తీరును మంగళవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, పాఠశాలను, సచివాలయాన్ని పరిశీలించారు. గృహాలను సందర్శించారు. విద్యార్థులు వాడుతున్న మరుగుదొడ్లను పరిశీలించారు. బృందం కమిటీ కన్వీనర్ శివకుమారి, సభ్యులు సూర్యకుమార్, శ్యామలరావు పరిశీలించారు. మంచినీరు ఎలా వాడుతున్నారో పరిశీలించారు.

వరిలో నిపుణుల సలహాలు పాటించాలి


రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త ఫణికుమార్

ఉంగుటూరు: వరి సాగులో చీడపీడలు తొలగించే విధానంపై నిపుణుల సూచనలు పాటించాలని ఏలూరు ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం వెల్లమిల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు నాగేంద్ర, ఫణికుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు గ్రూపుల ద్వారా 80 శాతం సబ్సిడీతో డ్రోన్‌ను ప్రభుత్వం అందజేస్తోందని రైతులకు తెలిపారు. ప్రస్తుతం కూలీల కొరత నేపథ్యంలో డ్రోన్ ఉపయోగించుకుంటే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. రైతులు గ్రామ వ్యవసాయ విస్తరణాధికారి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్చాలి


బడి బాట ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

భీమడోలు: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని కోరుతూ మంగళవారం సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక నమోదు కార్యక్రమం ముగింపును పురస్కరించుకొని ఇన్‌చార్జి హెచ్‌ఎం మండే సుధాకర్ ఆధ్వర్యంలో వారు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలు వద్దు–ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, నాణ్యమైన విద్యను పొందాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం మండే సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు షేక్ షీమా, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల్లో పోషక లోపాలను గుర్తించాలి


అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇస్తున్న ఐసీడీఎస్ ఏలూరు జోన్ ప్రాంతీయ సంచాలకులు బి.సుజాత

ఉంగుటూరు: పిల్లల్లో పోషక లోపాలను గుర్తించి ఆహారం అందజేయాలని ఐసీడీఎస్ ఏలూరుజోన్ ప్రాంతీయ సంచాలకులు బి.సుజాత అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు. మంగళవారం ఉంగుటూరు అంగన్‌వాడి కేంద్రం 179, 183 లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంలో అంగన్‌వాడి కేంద్రాలు ద్వారా అందుతున్న సేవలను ఆమె పరిశీలించారు. ముఖ ఆధారిత రేషన్ పంపిణీ కోసం తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు. పిల్లల్లో పోషణ లోపాన్ని గుర్తించేందుకు పిల్లల ఎత్తు, బరువు పొరబాట్లు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. కిశోర వికాసం ద్వారా బాలికల్లో అవగాహన కల్పించి బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ కార్యాలయపు నోడల్ అధికారి స్వరాజ్యలక్ష్మి, భీమడోలు సీడీపీవో రాజశేఖర్, ఉంగుటూరు సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి సహకరించాలి


విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరుకుతున్న సిబ్బంది

దెందులూరు: అన్ని గ్రామాల్లో ఇళ్ల యజమానులు లైన్‌మెన్లకు విధి నిర్వహణలో సహకరించాలని దెందులూరు మండలం లైన్‌మేన్ కోరారు. చెట్లు కొమ్మల వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని కొమ్మలు పడి తీగలు తెగిపోవడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అందరూ విద్యుత్ సరఫరాకు కొంత సేపు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న కొమ్మలను నరికే ప్రయత్నంలో యజమానులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

మండలంలో బుధవారం జోగన్నపాలెం, అప్పారావుపాలెం, శ్రీరామవరం, కంఠమనేనివారిగూడెం గ్రామాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. ఈ గ్రామాల్లో రైతులు విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బందికి సహకరించవలసిందిగా దెందులూరు మండల విద్యుత్ శాఖ ఇంజనీర్ శ్రీనివాసరావు కోరారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

- నిర్మానుష్యంగా రోడ్లు
- వాన రాక కోసం రైతన్నల ఎదురుచూపు


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన రహదారి


వర్షాలు కురవకపోవడంతో పొలంలో అరకొర నీటిలోనే దుక్కులు చేస్తున్న రైతులు

భీమడోలు: వర్షాకాలంలో సాధారణంగా ఎండలు తగ్గాలి. కానీ వాతావరణం విపరీతంగా వేడెక్కుతోంది. దీంతో ఉదయం 10 గంటలకే రోడ్లపై జన సంచారం కనిపించని పరిస్థితి ఏర్పడింది. మంగళవారం 31 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జాతీయ, రాష్ట్రీయ రోడ్లపై మధ్యాహ్నం వాహనాలు రాకపోకలు సాగించకపోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. మెట్ట ప్రాంతాల్లో సార్వా సీజన్‌లో వరి సాగుకు అవసరమైన వర్షాలు కురవక రైతాంగం ఆవేదన చెందుతున్నారు. దీంతో ఓ పక్క ఎండలతో సతమతమవుతుండగా మరో వైపు వర్షాలు పడక సార్వా పనులు సాగక రైతులు ఆవేదన చెందుతున్నారు. వరుణుడు కరుణించకపోతే రైతుల పరిస్థితి మరింత దయనీయకరంగా మారుతుందని ఆవేదన చెందుతున్నారు. దీంతో అత్యవసర పనులకు మినహా దూర ప్రాంతాలకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాళ్వాలో నీరందక ఇబ్బంది పడిన రైతాంగానికి సార్వా ప్రారంభంలోనే పంట పొలాలకు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. దీని వలన సాగు అలస్యమై ప్రకృతి వైపరీత్యాల బారిన పడతామని వారు మదన పడుతున్నారు. దీంతో పండిన పంట చేతి కందడం కష్టమవుతుందని వాపోతున్నారు. వరి పంట పొలాలకు పక్కనే గోదావరి ప్రవహిస్తున్న నీరందడం లేదు. మెట్టలో కరెంట్ లేక బోర్లు తిరగడం లేదు. విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆకాశం మేఘావృతం కావాలని వరుణుడి రాక కోసం రైతులు ఇష్ట దైవాలను మొక్కుతున్నారు.

ముమ్మరంగా ఆలయ పునర్నిర్మాణ పనులు


నిర్మాణంలో ఉన్న ఆలయం

దెందులూరు: పోతునూరు గ్రామంలో శ్రీగౌరీదేవి ఆలయ పునర్మిర్మాణ పనులు వేగవంతంగా చేస్తున్నారు. పోతునూరు గ్రామస్తుల ఆర్థిక సహాయ సహకారాలతో నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఆలయ నిర్మాణ పనులను కమిటీ సభ్యులు, గ్రామస్తులు పర్యవేక్షించారు.

శరవేగంగా తూడు తొలగింపు పనులు


తూడు తొలగింపు పనులు చేయిస్తున్న డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు

దెందులూరు: గోదావరి కాలువలో పేరుకుపోయిన తూడు తొలగింపు పనులను డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు ఆధ్వర్యంలో శరవేగంగా చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు తూడు తొలగింపుపై ఎంత ఖర్చు చేసినా రెండు మూడు నెలలకు మళ్లీ తూడు సమస్య యథావిధిగా ఉంటుంది. గోదావరి కాలువ ఆయకట్టు శివారు భూముల రైతులకు ఆటంకం లేకుండా సాగునీరు సరఫరా కావాలనే తూడు తొలగింపు పనులు చేస్తున్నామని చైర్మన్ వెలమటి రాంబాబు తెలిపారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

ఏలూరు (టూటౌన్): గ్యాస్ వినియోగం పట్ల మహిళలు జాగ్రత్తలు పాటించాలని హెచ్‌పీసీఎల్ సేల్స్‌మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎక్సెల్ గ్యాస్ కంపెనీ ప్రొప్రైటర్ మోటపర్తి శ్రీనివాస్ సూచించారు. స్థానిక 15వ డివిజన్ ఆముదాల అప్పలస్వామి కాలనీలో హెచ్‌పీసీఎల్ 51వ వార్షికోత్సవం సందర్భంగా కార్పొరేటర్ తంగెళ్ల రాము అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్యాస్ వినియోగం, ఊర్లు వెళ్లినప్పుడు గ్యాస్ పొయ్యి వద్ద తీసుకొనే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు 1906 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి గ్యాస్ కనెక్షన్ల సంబంధించిన కిట్లు బహుమతిగా అందజేశారు. కార్పొరేటర్ రాము మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ ద్వారా తమ డివిజన్‌కు సుమారుగా 270 కలెక్షన్లు దీపం ద్వారా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- ఇన్వెస్ట్‌మెంట్లు, జాబ్‌లు, లోన్‌ల పేరుతో టోకరా
- సొమ్ములు కాజేసిన గంటలో 1930కి ఫిర్యాదు చేయాలి
- రికవరీ చేస్తున్న ఏలూరు సైబర్‌సెల్ పోలీస్ అధికారులు


కైకలూరుకు చెందిన బాధితుడికి రూ.1.64 లక్షల సొమ్ము రికవరీ చేస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన ఒక న్యాయవాదిని సైబర్ నేరగాళ్లు మోసం చేసి భారీగా సొమ్ము కాజేశారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ప్రకటన చేస్తూ, పెట్టుబడి పెడితే భారీగా డబ్బులు ఆర్జించే అవకాశం ఉందని నమ్మించారు. వాట్సాప్ గ్రూప్‌లో కొందరు ఫేక్ వ్యక్తులను పరిచయం చేస్తూ, పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు ఆర్జించినట్లు చెప్పించారు. వీటిని నమ్మిన న్యాయవాది ఏకంగా రూ.60 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. తీరా కొద్దిరోజులు గడిచాక తాను మోసపోయినట్టు అర్థం కావటంతో ఏలూరు సైబర్ పోలీసులను ఆశ్రయించారు. ఏలూరు నగరానికి చెందిన ఒక బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌ను సైతం సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ఆశ చూపించారు. ఏకంగా ఆయనవద్ద నుంచి రూ.3 కోట్లకు పైగా డబ్బులు కాజేయటం గమనార్హం. ఫేక్ కంపెనీల పేరుతో ఇన్వెస్ట్‌మెంట్ చేయాలంటూ మాయమాటలు చెప్ప టంతో బాధితుడు నమ్మేశాడు. సైబర్ నేరగాళ్ల మోసాన్ని గ్రహించిన బాధితుడు ఏలూరు సైబర్‌సెల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెరుగుతోన్న సైబర్ నేరాలు

ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ స్టేషన్ వద్ద ఏలూరు సైబర్‌సెల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో ప్రతి రోజూ సైబర్‌నేరగాళ్ల బారిన పడుతున్నవారు కనీసం నలుగురు, ఐదుగురు ఉండడం గమనార్హం. నెలలో కనీసం 100 నుంచి 150 మంది వరకు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని భారీగా డబ్బు పోగొట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. ఏలూరు సైబర్ సెల్ సీఐ జి.దాస్, ఎస్సై వల్లీపద్మ ఆధ్వర్యంలో సైబర్ సెల్ టీమ్ బాధితులు పోగొట్టుకుంటున్న సొమ్ములు రికవరీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

బాధితులకు అండగా

ఇటీవల కాలంలో సైబర్‌నేరాలపై ప్రజలను పోలీస్ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్స్, బ్యాంకు రుణాలు, డిజిటల్ అరెస్టులు, అక్రమ వ్యాపారాలు, ఆన్‌లైన్ బిజినెస్‌లు పేరుతో ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలకు గురైన బాధితులు తక్షణమే 1930కు ఫిర్యాదు చేయాలని సైబర్‌సెల్ పోలీసులు కోరుతున్నారు. ఏలూరు జిల్లాలో ఇటీవల కాలంలో ఏకంగా రూ.12లక్షల మేర సొమ్ములను రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

- కైకలూరు మండలం తామరకొల్లు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి శ్రీనివాసరావు సెల్‌ఫోన్‌కు సోషల్ మీడియాలో ఒక లింక్ వచ్చింది. ఏపీకే లింక్ ఫైల్ ఓపెన్ చేశారు. సైబర్ నేరగాళ్లు శ్రీనివాసరావు బ్యాంకు ఖాతాలో నుంచి ఏకంగా రూ.1,64,000 సొమ్మును వారి ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన అప్రమత్తమై బ్యాంకు అధికారులను సంప్రదించారు. పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కైకలూరు టౌన్, ఏలూరు సైబర్‌సెల్ పోలీసులు సంయుక్తంగా బాధితుడు పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేశారు. ఈ సొమ్మును ఎస్పీ కేపీ శివకిషోర్ చేతులుమీదుగా అందజేశారు.
- ఏలూరుకు చెందిన ఒక మహిళ తిరుపతి నుంచి ప్రయాణిస్తుండగా బస్సులో ఆమె సెల్‌ఫోన్ చోరీ చేశారు. సెల్‌ఫోన్ ఆధారంగా ఆమె బ్యాంకు ఖాతాలో డబ్బులు కాజేశారు. బాధితురాలు వెంటనే 1930కు ఫిర్యాదు చేయగా ఏలూరు సైబర్‌సెల్ సీఐ దాస్, ఎస్సై వల్లీపద్మ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకు ఖాతాలను ట్రేస్ చేసి బాధితురాలి సొమ్ము రూ.25 వేలు మంగళవారం ఏలూరులోని సైబర్‌స్టేషన్‌లో అందజేశారు.

నేడు పాఠశాలలో ప్రారంభోత్సవాలు

దెందులూరు: జోగన్నపాలెం విద్యాలయం ఉన్నత పాఠశాలలో బుధవారం బాత్‌రూమ్‌లను, బెంచీల ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామని హెచ్‌ఎం ఆర్.రవి తెలిపారు. బాత్‌రూమ్‌లను దివంగత హెచ్‌ఎం విష్ణు ఆర్థిక సాయంతో నిర్మించారన్నారు. కాగా బెంచీలను హడ్కో ఆర్థిక సాయంతో కొనుగోలు చేశారని తెలిపారు.